క్లుప్తంగా

దాతలకు సర్టిఫికెట్లు ప్రదానం



దాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న వైద్యులు

ఆదోని టౌన్: టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పేద క్షయవ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను అందించిన దాతలకు నిక్షయ్ మిత్ర సర్టిఫికెట్లను ప్రదానం చేసినట్లు డాక్టర్ షేకున్‌బాను, మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ వినోద్‌కుమార్, డాక్టర్ అనిల్‌సాగర్ తెలిపారు. గురువారం ఆదోని పట్టణంలోని షరీఫ్‌బజార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో డాక్టర్ల సమక్షంలో డాక్టర్ వినోద్‌కుమార్, సూపర్‌వైజర్ జ్ఞానేశ్వరి, తేజేశ్వర్‌గౌడ్, పరశురామ్, విజయ్, రమాదేవి, శశికళ, కృష్ణవేణి, జ్యోతి, వరలక్ష్మి, అరుణ తదితరులకు సర్టిఫికెట్లను అందజేశారు.

ఘనంగా గ్యారతారీఖ్ వేడుకలు

కౌతాళం: మండల కేంద్రంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో గురువారం గ్యారతారీఖ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

విద్యుదాఘాతానికి విద్యార్థి బలి



తన్వీర్ (ఫైల్)

ఆదోని అర్బన్: పట్టణంలోని మాసా మసీద్ కాలనీలో ఓ విద్యార్థి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నియాజ్ అహ్మద్, హమీనాబానుకు నలుగురు కుమారులు. పెద్ద కుమారుడైన తన్వీర్(17) ఓ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. బుధవారం రాత్రి కుళాయికి మోటార్ వేసేందుకు స్విచ్ ఆన్ చేశాడు. దీంతో తన్వీర్ షాక్‌కు గురయ్యాడు. కుటుంబ సభ్యులు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దరఖాస్తుల పరిశీలన

కౌతాళం: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయానికి నూతన పాలక మండలి ఏర్పాటు కోసం ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించిన విషయం తెలిసిందే. దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం ఆలయ ఈఓ వాణి ఆధ్వర్యంలో గురువారం ఆలయ కార్యాలయంలో చేపట్టారు. పాలక మండలి సభ్యుల కోసం 62మంది దరఖాస్తులు చేసుకోగా పత్రాలను పరిశీలనకు 58 మంది హాజరైనట్లు ఈఓ తెలిపారు.

రేషన్‌కార్డు మంజూరు చేయండి

ఎమ్మిగనూరుటౌన్: ట్రాన్స్‌జెండర్లకు వ్యక్తిగత రేషన్ కార్డులు మంజూరు చేయాలని పట్టణానికి చెందిన ట్రాన్స్‌జెండర్లు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శేషఫణికి వినతి పత్రం అందజేశారు. ట్రాన్స్‌జెండర్లు వి.సింధు, గౌరికళ, సౌమ్య, మోక్ష, రాధ, అంజలి, చిట్టి, లక్కి, అమ్ములు, సుగుణ, సుమణ, అర్పిత, చందన, నిఖిత మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లుగా వున్న తమకు వ్యక్తిగత రేషన్‌కార్డులు మంజూరు కాలేదన్నారు. దీంతో తాము ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు.

భూకబ్జా చేస్తున్నా పట్టించుకోరా?

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని మైనారిటీ కాలనీలో భూకబ్జాలకు పాల్పడుతున్నా పాలకులు ఏమాత్రం పట్టించుకోకపోవడం దారుణమని కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఖాశింవలి ఆరోపించారు. గురువారం మైనారిటీ కాలనీని ఆ పార్టీ నాయకులతో కలిసి సందర్శించారు. అసంపూర్తిగా ఉన్న ట్యాంక్, రోడ్లు, డ్రైన్లు లేని వీధులను పరిశీలించారు. ఆసిఫ్, హజరత్‌వలి, షబ్బీర్, షాకీర్, అజయ్ పాల్గొన్నారు.

యూరియా అందించాలి

ఆదోని రూరల్: రైతులకు సరిపడా యూరియాను అందించాలని డీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఢణాపురం ఉదయ్, రైతులు ఈరన్న, సిద్ధలింగ డిమాండ్ చేశారు. గురువారం మార్కెట్‌యార్డు ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. యూరియా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నార్నారు.



బోరు వేసి వదిలేసిన దృశ్యం



ప్లేట్లు కడుక్కునేందుకు బస్టాండ్ వద్దకు వెళ్తున్న విద్యార్థులు

ప్లాంట్ ఉన్నా తప్పని పాట్లు

మంత్రాలయం రూరల్ : నియోజకవర్గ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాదాపు 900 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాలలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసినా బోరు సౌకర్యం లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. బోరు వేసి మూడు నెలలు కావొస్తున్నా మోటారు కనెక్షన్ ఇవ్వకపోవడంతో విద్యార్థులు మధ్యాహ్న భోజనం సమయంలో తాగునీటి కోసం పాట్లు పడుతున్నారు. ఎక్కిళ్లు తీర్చుకోవడానికి కొందరు విద్యార్థులు ఇంటి నుంచే వాటర్ బాటిళ్లు తెచ్చుకుంటున్నారు. ప్లేట్లు శుభ్రం చేసుకోవడానికి ఆర్టీసీ బస్టాండ్‌కు, పాత పాఠశాల వైపు పరుగులు పెడుతున్నారు. విద్యార్థులు అవస్థలు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇకనైనా విద్యాశాఖాధికారులు స్పందించి పాఠశాలలో నీటి సమస్యలను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మాజీ ఎమ్మెల్యేపై నిందలు సరికాదు



మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

ఆదోని టౌన్: ఆదోని నియోజకవర్గంలో గత 15–20 ఏళ్లుగా అన్నివిధాలా అభివృద్ధి చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిపై కూటమి ఎమ్మెల్యే పార్థసారథి అనుచిత వ్యాఖ్యలు చేస్తూ నిందలు వేయడం భావ్యంకాదని దళిత సంఘాల నాయకురాలు, అంగన్‌వాడీ కేంద్రాల విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్రీలక్ష్మి, ఆదోని నియోజకవర్గ ప్రచార కార్యదర్శి పరిగెల నారాయణ, ఎస్సీ సెల్ నియోజకవర్గ కార్యదర్శి వై.పి.గంగాధర్ అన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు మాట్లాడారు. పార్థసారథి ఎమ్మెల్యేగా గెలిచి 14 నెలలైనా ఒక్క అభివృద్ధి పని కూడా చేపట్టలేదన్నారు. ఎన్నికల ముందు ఆదోని అభివృద్ధికి రూ.500 కోట్లు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానని నమ్మబలికిన ఎమ్మెల్యే నేటికీ ఒక్క రూపాయి పని కూడా చేయలేదన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి అంటే ఇదేనా అని ప్రశ్నించారు. చిన్న విషయాన్ని పెద్దదిగా చేస్తూ మాజీ ఎమ్మెల్యే సాయిని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో 11 రోజులుగా వ్యాపారాలు నిలిచిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోని కూటమి నేతలకు మాజీ ఎమ్మెల్యే సాయిని విమర్శించే అర్హత లేదన్నారు. ఆరోపణలు చేసేముందు వాస్తవాలు తెలుసుకుని ఎమ్మెల్యే మాట్లాడాలని సూచించారు. సమావేశంలో దళిత సంఘాల నేతలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



పురపాలక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎస్‌బీఐ సిబ్బంది

ఆదోని సెంట్రల్: పట్టణంలోని సెయింట్ అంథోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేశవయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కోసిగి: మండల కేంద్రంలోని శ్రీ చౌడేశ్వరి యూపీ స్కూల్‌లో కరస్పాండెంట్ పి. కృష్ణమూర్తి ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గోనెగండ్ల: దేశ అభివృద్ధిలో గురువు పాత్ర ఎంతో కీలకమైనదని ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ జిల్లా మేనేజర్ హసన్, ఎస్‌బీఐ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ మధు మనోహర్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఎస్‌బీఐ బ్యాంకు ఉద్యోగులు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నాగభూషణం, శ్రీరామ స్కూల్ కరస్పాండెంట్ సుబ్రహ్మణ్యంను శాలువాలతో సన్మానించారు.

గురువులకు సన్మానం

ఆదోని అర్బన్: పట్టణంలోని డీఎస్పీ బంగ్లా వద్ద ఉన్న పురపాలక ప్రాథమిక పాఠశాలలో గురువారం ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో ముందస్తు గురుపూజోత్సవం (టీచర్స్ డే) వేడుకలను నిర్వహించారు. గురువులైన హెచ్‌ఎం వెంకటరాముడు, ఉపాధ్యాయులు చక్రవర్తి, తారాదేవిలకు శాలువాలు వేసి సన్మానించారు. ఆదోని పట్టణ అవోపా, వామ్ అధ్యక్షులు డా.వంకదారు శ్రీనాథ్ గుప్తా మాట్లాడుతూ ప్రతిఒక్క విద్యార్థి గురువులను గౌరవించాలన్నారు. అనంతరం గురువుల ఆవశ్యకత ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అవోపా మరియు వామ్ కార్యదర్శులు రఘు, కోశాధికారి యాతగిరి వెంకటేశ్వర్లు, అవోపా, వామ్ మహిళా విభాగం అధ్యక్ష కార్యదర్శులు వంకదారు మమతాశ్రీ, శ్రీదేవి, సభ్యులు పాల్గొన్నారు.

ఆదోని సెంట్రల్: ఉపాధ్యాయుల దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని ఆర్‌ఆర్ లెబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను మార్కెట్ యార్డ్, మెయిన్ ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్లు చంద్ర శేఖర్, మధు గురువారం సన్మానించారు. హెచ్‌ఎం రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రిలీజ్ ఆర్డర్ ఇవ్వకుంటే రేషన్ ఎలా పంపిణీ చేయాలి?



రేషన్ డీలర్ ఈడిగ దోమ నాగరాజు

కోసిగి: మండల పరిధిలో దొడ్డి గ్రామంలో రేషన్ బియ్యం రిలీజ్ ఆర్డర్ ఇవ్వకుండా ప్రజలకు ఎలా పంపిణీ చేయాలని రెగ్యులర్ రేషన్ డీలర్ ఈడిగ దోమ నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో 17 ఏళ్లుగా రెగ్యులర్ డీలర్‌గా పనిచేస్తున్నానని, అయితే మూడు నెలల క్రితం కావాలని కొందరు తనపై కుట్ర పన్ని అధికారులచే సస్పెన్షన్ చేయించారని వాపోయాడు. కోర్టును ఆశ్రయించడంతో గత నెల 25న మరలా రేషన్ వేసేలా అనుమతి వచ్చిందని తెలిపాడు. ఈనెల కోటా రేషన్ బియ్యం తన స్టాక్ పాయింట్ వద్ద దించకుండా గ్రామంలోని తిరుమలేశ్వర ఆలయంలో దించారని, అక్కడ ఎలాంటి భద్రత లేదని, అక్కడే రేషన్ బియ్యం వేయాలని చెబుతున్నారన్నారు. రాత్రిళ్లు ఎవరైనా బియ్యం కాజేస్తే ఎవరు బాధ్యులని ప్రశ్నించాడు. తన పరిధిలో గతంలో ఉన్న రేషన్ స్టాక్ పాయింట్ వద్ద బియ్యం వేసేందుకు అనుమతి ఇవ్వాలని రెవెన్యూ అధికారులకు విన్నవించాడు. పాత స్టాక్ పాయింట్ వద్ద లేక ప్రభుత్వ కార్యాలయాల వద్ద రేషన్ బియ్యం అందించాలని ఎస్సీ కాలనీ వాసులు నాగేష్, రాజేష్, జేమ్స్ , భీమయ్య, ఉలిగమ్మ తదితరులు రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. దేవాలయంలో రేషన్ బియ్యం వేస్తే తాము ఎలా వెళ్లి తెచ్చుకోవాలని ప్రశ్నిస్తున్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక



జి.చిన్నబాబు,ఎం.శోభాదేవి,డి.దుర్దాన ఫర్వీన్,నిరంజన్ కుమార్

గోనెగండ్ల : మండలంలో ఆయా పాఠశాలల్లో టీచర్‌గా పనిచేస్తున్న ముగ్గురు ఉపాధ్యాయులు జి. చిన్న బాబు, ఎం. శోభాదేవి, డి.దుర్దాన ఫర్వీన్‌లు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. జి. చిన్న బాబు గాజులదిన్నె గ్రామంలోని ఎంపీపీఎస్(ఎస్సీ) పాఠశాలలో గత 8 సంవత్సరాలుగా ఎస్జీటీ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఎం.శోభదేవి ఎర్రబాడు గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో రెండు నెలలుగా పీఎస్‌హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు. డి.దుర్దాన ఫర్వీన్ గోనెగండ్లలోని ఎంపీపీఎస్ బస్టాండ్ స్కూల్‌లో గనాలుగు సంవత్సరాలుగా ఎస్జీటీ(ఉర్దూ) టీచర్‌గా పనిచేస్తున్నారు.

ఆదోని సెంట్రల్: ఆదోని పురపాలక పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఎం. నిరంజన్ కుమార్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యాడు. విద్యార్థులకు పాఠాల బోధనతో పాటు వారికి ఆర్థికంగా చేయూత నందించడం, సొంత ఖర్చులతో సమాజ సేవ చేస్తుంటారు.

గుంతకల్ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్: రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డిపై గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, జిల్లా ఉపాధ్యక్షుడు పి.హనుమంతు, కె.మల్లయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, కౌలు రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు అన్నారు. గుంతకల్ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని గురువారం పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజకవర్గంలోని గుత్తి, పామిడి మండలాల్లో సోలార్, విండ్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుతో భూములు కోల్పోతున్న నిర్వాసిత గ్రామాల్లో పరిశీలనకు రైతులతో కలిసి వెళ్లిన ఏపీ రైతు సంఘం నాయకులను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఫోన్‌లో అసభ్య పదజాలంతో తిడుతూ బెదిరించారన్నారు. రైతుసంఘం నాయకులకు ఎమ్మెల్యే బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తిక్కన్న, అయ్యప్ప, ఈరన్న, రంగస్వామి, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి

ఆదోని రూరల్: బన్నూరు నుంచి చదువుకోవడానికి ఆదోని పట్టణంలోని పాఠశాలలు, కళాశాలలకు వచ్చే విద్యార్థుల కోసం బస్సు సౌకర్యం కల్పించాలని పీడీఎస్ఓ రాష్ట్ర నాయకులు తిరుమలేష్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపో అధికారికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో పీడీఎస్ఓ పట్టణ కార్యదర్శి రాజేష్, మల్లి, స్వామి, సమర్థ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఈ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

ఆదోని టౌన్: ఆర్టీఈ విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరి నాయుడు డిమాండ్ చేశారు. గురువారం ఆదోని డివిజన్ బీసీ ఫెడరేషన్ కార్యాలయంలో ఆదోని పట్టణాధ్యక్షులు డాక్టర్ వీరేష్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీఈ విద్యార్థులకు గత మూడు సంవత్సరాల ఫీజు బకాయిలు చెల్లించడంతో పాటు ప్రభుత్వం విద్యాసంస్థలకు ఇస్తున్న ఫీజును రూ.25 వేలకి పెంచాలని, తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలన్నారు. సమావేశంలో తాలూకా గౌరవ సలహాదారులు బండారి రాజేశ్వరరావు, పట్టణ గౌరవ సలహాదారులు నల్లారెడ్డి, జాయింట్ సెక్రటరీ బి.చిన్న ఈరప్ప, పగడాల కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

నందవరం : సీజనల్ వ్యాధుల పట్ల వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు అప్రమత్తంగా ఉండి ప్రజలకు వైద్య సేవలు అందించాలని డిప్యూటీ ఎంపీడీఓ సందీప్ సూచించారు. గురువారం నాగలదిన్నె గ్రామంలో హెల్త్ కేంద్రంలో ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో వైరల్ జర్వాలు ఎక్కువగా ఉన్నాయని, తగు జాగ్రత్తలతో వైద్య పరీక్షలు చేపట్టాలన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

నందవరం : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ పుల్లయ్య సూచించారు. గురువారం మండల కేంద్రంలోని చెత్త సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మురుగు కాలువలు, వీధులు, నీటి కుంటలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ సందీప్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పూలచింత పీఠాధిపతికి నివాళి

నందవరం : మండల పరిధిలోని పూలచిత శ్రీబండే గురుడి మఠం పీఠాధిపతి అనారోగ్యంతో శివైక్యం చెందిన విషయం విధితమే. గురువారం ఆంధ్ర, కర్ణాటక నుంచి అశేష శిష్య బృందం, భక్త బృందం నడుమ పీఠాధిపతి జయశంకర స్వామి శివైక్యం క్రతువు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి గడ్డం నారాయణ రెడ్డి తదిరతలు పీఠాధిపతి జయశంకర భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయా మఠాల పీఠాధిపతులు పాల్గొన్నారు.

పట్టణ సీఐని విధుల నుంచి తొలగించాలి

ఎమ్మిగనూరుటౌన్: గత నెల 31న వినాయక నిమజ్జనం సందర్భంగా పట్టణంలో ఆటో డ్రైవర్ అశోక్, డీజే ఆపరేటర్ రంగస్వామిని విచక్షణ కోల్పోయి బూటుకాలుతో తన్నిన సీఐ శ్రీనివాసులును తక్షణం ఉన్నతాధికారులు విధుల నుంచి తొలగించాలని ఏపీ హెచ్‌ఆర్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యూజీ శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి యూఎం దేవేంద్రబాబు, మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సన్న, న్యాయవాది ఎద్దుల చెన్నయ్య డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో వారు విలేకరులతో మాట్లాడారు. సంఘటనపై తాము విచారించామని, బాధితులు తప్పు చేసి వుంటే వారిపై సీఐ చట్టపరంగా చర్యలు తీసుకోకుండా విచక్షణ కోల్పోయి దాడి చేయడం అమానుషమన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఎమ్మిగనూరురూరల్: పట్టణానికి చెందిన బొమ్మల తయారీ కార్మికుడు వీరేష్ వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పట్టణంలోని ఉప్పర రాఘవేంద్ర బొమ్మల వ్యాపారం కోసం వడ్డీ వ్యాపారుల వద్ద రూ.5 లక్షలు తన దగ్గర పనిచేసే కార్మికుడు వీరేష్‌ను జామీనుగా పెట్టి తీసుకున్నాడు. రూ. 5 లక్షలకు రోజు రూ.15 వేలు వడ్డీ చెల్లిస్తూ వచ్చాడు. వ్యాపారం జరగకపోవటంతో అప్పు చెల్లించలేక ఉప్పర రాఘవేంద్ర పట్టణం వదలి పారిపోయాడు. అయితే వడ్డీ వ్యాపారులు జామీనుదారుడైన వీరేష్‌ను నీవే అప్పు కట్టాలని రోజూ వేధించటం మొదలు పెట్టారు. ఫోన్ చేసి బెదిరించటంతో భయంతో గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయ్నానికి పాల్పపడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారస్తున్నామని పట్టణ పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయులను నియమించండి

పెద్దకడబూరు: మండల పరిధిలోని కల్లుకుంట ఉర్దూ పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలని ఏఐవైఎఫ్ తాలూకా అధ్యక్షుడు రెడ్డి జాఫర్ పటేల్, ఏఐఎస్‌ఎఫ్ మండల ఉపాధ్యక్షుడు దస్తగిరి కోరారు. గురువారం ఎమ్మార్సీ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయులు లేక పోవడంతో విద్యార్థుల చదువులు సాగడం లేదన్నారు. సంఘం మండల ఉపాధ్యక్షుడు షేక్ హజరత్‌బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని పాఠశాలలను సీజ్ చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వ అనుమతుల్లేకుండా నిర్వహిస్తున్న శ్రీరామ, రవీంద్ర పాఠశాలలను విద్యాశాఖ అధికారులు వెంటనే సీజ్ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు ఉదయ్, శేఖర్, ఆఫ్రిది,రఘునాథ్, కృష్ణ, ఖాజ, సురేష్ డిమాండ్ చేశారు. గురువారం ఆయా పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

ఉల్లికి రూ.3వేలు మద్దతు ధర కల్పించాలి

ఎమ్మిగనూరుటౌన్: ఉల్లి పంటకు క్వింటా రూ.3వేల మద్దతు ధర కల్పించాలని ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఏసేపు, తాలూకా నాయకులు జయన్న, శాంసన్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు అప్పులపాలు అవుతున్నారన్నారు. ఉల్లి రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని కోరారు. నాయకులు అనీఫ్, దావీదు, జకరయ్య, చిన్న రాజు, హుసేని తదితరులు పాల్గొన్నారు.

రైతులంటే ప్రభుత్వానికి చిన్నచూపు

- వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్‌కుమార్‌రెడ్డి
- రైతుల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం
- 9న జరిగే రైతు ధర్నాకు తరలి రావాలని పిలుపు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి

మంత్రాలయం : కూటమి ప్రభుత్వం కర్షకులను చులకనగా చూస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. గురువారం ఎమ్మిగనూరులోని భీమా నిలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎరువులు దొరక్క రైతులు అల్లాడిపోతుంటే వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఎగతాళిగా మాట్లాడటం సిగ్గు చేటన్నారు. పెళ్లిళ్లకు వెళితే భోజనాలకు, దర్శనాలకు వెళితే క్యూలైన్లలో నిలవడం లేదా.. అలాగే రైతులు ఎరువుల కోసం బారులు తీరితే తప్పేమంటూ అచ్చెన్న నోరుపారేసుకోవడం తగదన్నారు. బాధ్యత మరిచి రైతులపై అక్కసు వెళ్లగక్కడం దారుణమన్నారు. రాష్ట్రంలో రైతులకు యూరియా దొరక్క నానా అగచాట్లు పడుతున్నారని, వచ్చిన యూరియా బస్తాలు టీడీపీ నాయకుల కాంపౌండ్లకే సరిపోతుందని విమర్శించారు. యూరియా కావాలంటే రైతులు టీడీపీ నాయకులను వేడుకోవాల్సిన దౌర్భాగ్య పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా సరాఫరాపై సోషియల్ మీడియాలో పోస్టులు పెడితే యాక్టివిస్టులపై కేసులు పెట్టడం మరీ శోచనీయమన్నారు. మరో వైపు ఉల్లి రైతులు గిట్టుబాటు ధర లేక పొలాల్లోనే పంటను వదిలేస్తున్నారని, వేలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఇవేమి పట్టించుకోని చంద్రబాబు అమరావతి భజనకే పరిమితమయ్యారని విమర్శించారు. రైతుల పక్షాన పోరాడేందుకు వైఎస్సార్‌సీపీ సిద్ధమైందన్నారు. ఈనెల 9న ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే రైతు ధర్నాకు రైతులు తరలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి పురుషోత్తంరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రవిచంద్రారెడ్డి, ఆయా మండలాల కన్వీనర్లు భీమారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ప్రహ్లాదాచారి, ఎంపీపీ అమరేష్, పార్టీ లీగల్‌సెల్ జిల్లా కమిటీ అడ్వైజర్ గురురాజారావు, కో–ఆప్షన్ మెంబర్ మాబుసాబ్, నాయకులు పాల్గొన్నారు.